క్లుప్తంగా

నీటి సమస్యకు పరిష్కారం

మహమ్మదాబాద్: మంగంపేట్ తండాలో నీటి ఎద్దడి సమస్యను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి తెలపడంతో వెంటనే స్పందించి పరిష్కారానికి కృషిచేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. సమస్యపై స్థానికులు ఎమ్మెల్యేకు ఫోన్‌లో వివరించారని పేర్కొన్నారు. దీంతో తక్షణమే నూతన బోరు వేయించినట్లు పేర్కొన్నారు. దీంతో స్థానికులు, నాయకులు ఎమ్మెల్యేకు ఫోన్‌లో ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వికారాబాద్ ఎస్టీసెల్ అధ్యక్షుడు సునీల్‌కుమార్, నాయకులు మోతిరాం, రంగ్యా, గణేష్, అంబ్రు, బాలు, కిషన్, గోపాల్, రమేష్, ముకుందం, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేలం నిర్వహణకు చర్యలు

జడ్చర్ల: మున్సిపాలిటీపరిధిలో మాంసం దుకాణాల నుంచి వ్యర్థాల సేకరణకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో లోగుట్టుగా నామమాత్రపు రుసుముతో తమకు ఇష్టం వచ్చిన వారికి ఈ టెండర్‌ను కట్టబెట్టి వ్యక్తిగత లాభాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించి మున్సిపల్‌కు ఆదాయాన్ని సమకూర్చే దిశగా చర్యలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ఆదేశించారు. దీంతో వచ్చే నెల 2న మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల ఓ వ్యక్తికి సిఫారసుపై ఏడాది కాలానికి సంబంధించి కేవలం రూ.75వేలకు ఈ టెండర్‌ను కట్టబెట్టగా.. ఎమ్మెల్యే ఆదేశంతో రద్దు చేసి కొత్తగా వేలం నిర్వహించనున్నారు.

నేడు సమావేశం

రాజాపూర్: వినాయక చవితిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు శాంతి కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని స్థానిక ఎస్‌ఐ రవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల యువజన సంఘాల సభ్యులకు వినాయక మండప ఏర్పాటు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని వివరించారు.

'వ్యాధుల బారిన పడుతున్నాం'

నవాబుపేట: కోళ్ల ఫాంలతో గ్రామాల్లో ఈగల బెడద ఎక్కువైందని.. వ్యాధుల బారిన పడుతున్నామని చౌడూర్, కాకర్‌జాల్, కాకర్‌జాల్‌తండా గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో ప్రజాప్రతినిధులకు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టే వారని ప్రస్తుతం తమ గోడు వినేవారే కరువయ్యారని వాపోతున్నారు. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మందుల పిచికారీ వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. విషయంపై ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు స్పందిస్తూ కోళ్ల ఫాంల వల్ల ఈగల బెడద పెరిగిందన్నారు. ఈ మేరకు యాజమాన్యాలకు నోటీసులు సైతం ఇచ్చినట్లు వివరించారు. కాగా ఏడాదిగా ఎలాంటి మందు పిచికారీ చేయలేదని పేర్కొన్నారు.

సేవకు ప్రతిరూపం మదర్ థెరిస్సా



స్టేషన్ మహబూబ్‌నగర్: మదర్ థెరిస్సా సేవలను మరువలేమని డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌పల్లిలో సోమవారం మదర్ థెరిస్సా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బెనహర్ మాట్లాడుతూ సేవకు ప్రతిరూపం మదర్ థెరిస్సా అని కొనియాడారు. ఆమె తన జీవితాన్ని నిరుపేదల కోసం త్యాగం చేశారని తెలిపారు. మదర్ థెరిస్సాను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.



జిల్లాకేంద్రం మా ఆకృతి పాఠశాలలో..



జిల్లాకేంద్రంలోని అక్షర పాఠశాలలో..



జిల్లాకేంద్రంలోని దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో..

భజరే నందగోపాల హరే..



చిన్నరాజమూర్ ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ



అడ్డాకులలో శ్రీకృష్ణ వేషధారణ చేసిన చిన్నారిని ఎత్తుకున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

సాక్షినెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు.

■ త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక మహబూబ్‌నగర్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పద్మావతీకాలనీలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రతినిధి నాగ్యానాయక్ తెలిపారు. వచ్చేనెల 5న మధ్యాహ్నం 2 గంటల నుంచి పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

జిల్లా కేంద్రంలోని అక్షర పాఠశాలలో వేడుకల్లో ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని మా ఆకృతి పాఠశాలలో వేడుకల్లో కరస్పాండెంట్ రాఘవేందర్, వైస్ ప్రిన్సిపాల్ మాధవీలత, ఇంచార్జీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని బ్రహ్మమానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో వేడుకల్లో భారత్ వికాస్ పరిషత్ పాలమూరుశాఖ అధ్యక్షులు భూషణ్‌పాండే, జయప్రకాశ్ పాల్గొన్నారు.

■ జడ్చర్ల పరిధిలో బాదేపల్లి సంతోషిమాత దేవాలయంలో శ్రీకృష్ణుడికి పంచామృతాభిషేకం, డోలాహరణం, తులాభారం జరిపించారు. సంస్కార భారతి ఆధ్వర్యంలో చిన్నారులకు చిన్నికృష్ణుల వేషధారణ చేశారు. సరస్వతి శిశుమందిరంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల అధ్యక్షురాలు పద్మలీల, కార్యదర్శి సోముల కృష్ణయ్య, ప్రదానాచార్యులు వెంకటయ్యలు పాల్గొన్నారు. 167వ నెంబరు జాతీయరహదారిపై ఇందిరానగర్‌లో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు చేసి డోలాహరణం జరిపించారు. వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం రాత్రి డోలాహరణం వైభవంగా జరిపించారు.

■ మూసాపేట, అడ్డాకుల మండలాల్లో వేడుకల్లో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

■ దేవరకద్ర మండలంలోని చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకం చేసి నీలిరంగు వస్త్రాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి గోశాలలో ఆదివారం రాత్రి ఓ ఆవు లేగదూడకు జన్మనివ్వగా.. ఆ దూడను కృష్ణుడు అని పిలుస్తూ సోమవారం పలువురు భక్తులు పూజలు చేశారు. అదేవిధంగా ఆలయంలో భక్తులకు హైదరాబాద్‌కు చెందిన దండిగారి వీరన్న పేరున ఆయన భార్య దండిగారి పుష్పలత అన్నదానం చేశారు. మండల కేంద్రంలోని శివాలయం, వీరప్పయ్యస్వామి దేవాలయాలలో అఖండ దీపారాధన కార్యక్రమం కొనసాగుతోంది. చెన్నకేశవస్వామి ఆలయంలో డోలారోహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు.





జడ్చర్ల సంతోషిమాత ఆలయంలో..

■ అడ్డాకుల మండలంలోని గుడిబండ గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమ ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు వేసిన బొడ్డెమ్మలు ఆకట్టుకున్నాయి. మహబూబ్‌నగర్ కమిటీ అధ్యక్షుడు నాగ్యానాయక్, మన్నెంకొండ పాల్గొన్నారు.

■ రాజాపూర్ పరిధిలోని రాయపల్లి, ఈద్గాన్‌పల్లి తదితర గ్రామాల్లోనూ, నవాబుపేట వేడుకల్లో ఎర్రన్నయాదవ్, బుచ్చలయ్య, పుల్లయ్య, శ్రీశైలంయాదవ్, సుదర్శన్, లింగం, సాయిలింగం తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్ల సరస్వతి శిశుమందిరంలో..



జిల్లాకేంద్రంలోని శిశుమందిర్‌లో..



అడ్డాకులలో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు



నవాబుపేటలో..

నేడు కృష్ణమందిరంలో వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం పద్మావతి కాలనీలోని శ్రీ మురళీకృష్ణ మందిరంలో సుందర సత్సంగ్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం అభిషేకం, అలంకారం, అఖండ దీపారాధన, పుణ్యాహవాచనం, మహానైవేద్యం, మంగళహారతి నిర్వహిస్తారు. శ్రీకృష్ణ అష్టోత్తర నామావళి పారాయణం నిర్వహించడంతోపాటు అర్ధరాత్రి 12 గంటల అనంతరం శ్రీకృష్ణుని విగ్రహానికి ఉయ్యాల సేవ ఘనంగా నిర్వహించనున్నారు.



గుడిబండలో శ్రీకృష్ణుడి ఊరేగింపులో భక్తులు



జిల్లాకేంద్రంలో చిన్నారుల కోలాటం



జిల్లాకేంద్రంలో ప్రత్యేక వేషధారణలో చిన్నారులు



జిల్లాకేంద్రంలో..

వార్డుల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తాం



మైత్రీనగర్‌లో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలను సాధ్యమైనంతవరకు పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం 8వ వార్డు పరిధిలోని పద్మావతీకాలనీలో, 22వ వార్డులోని మైత్రీనగర్‌లో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. పద్మావతీకాలనీలో దెబ్బతిన్న సీసీ రోడ్లను, మైత్రీనగర్‌లోని లోతట్టులో ఉన్న సీసీరోడ్డు వర్షపు నీరు మడుగులా ఉండటాన్ని, అలాగే కాలనీలో చాలాచోట్ల ఇప్పటికీ మట్టిరోడ్లే ఉండటాన్ని గమనించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానికులు శెట్టి చంద్రశేఖర్, కొప్పుల శ్రీనివాస్, విజయ్‌రెడ్డి, సుభాష్, ప్రశాంత్, చుక్కల శేఖర్, కృష్ణకాంత్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, ఎల్లాగౌడ్, శివ, దత్తు, శ్యాంసుందర్ రెడ్డి, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంటలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి



మాట్లాడుతున్న బాలకిషన్

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని నల్లకుంటలో ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా జరుగుతున్న నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాలకిషన్ డిమాండ్ చేశారు. సోమవారం నల్లకుంటలో నిర్మాణ ప్రాంతాన్ని సీపీఐ జిల్లా బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లకుంటలో జరుగుతున్న నిర్మాణాన్ని పరిశీలించి వెంటనే కూల్చివేయాలన్నారు. ఇరిగేషన్ డీఈ అక్రమ నిర్మాణం తొలగించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ స్థానికంగా కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం తగదన్నారు. కార్యక్రమంలో జడ్చర్ల మండల నాయకులు కృష్ణయ్య, రాము, రాజు, ఆంజనేయులు, శంకర్, రాములు, గోపాల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటమైసమ్మ బోనాలు

రాజాపూర్: ముదిరెడ్డిపల్లి, రంగారెడ్డిగూడ గ్రామాల్లో సోమవారం భక్తిశ్రద్ధలతో కోటమైసమ్మ బోనాల వేడుక నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లోని వీధులను వేపకొమ్మలతో అలంకరించారు. సాయంత్రం మహిళలు బోనాలను ఎత్తుకుని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన కోటమైసమ్మ ఆలయంవద్ద అమ్మవారికి బోనాలను సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. మాజీ ఎంపీటీసీ శేఖర్‌గౌడ్, నాయకులు నారాయణగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కార్మికుల సమస్యలపై కౌన్సిలర్లకు వినతి



జడ్చర్ల టౌన్: కొద్దిరోజులుగా దశలవారీగా ఆందోళనలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు సోమవారం స్థానిక కౌన్సిలర్లకు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలు సమర్పించారు. కౌన్సిలర్ల ఇంటికి వెళ్లి సమస్యలను విన్నవించారు. న్యాయమైన, తీర్చగలిగే ఆస్కారం ఉన్న సమస్యలను పరిష్కరించమని కోరితే కమిషనర్ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని వారి దృష్టికి తీసుకువచ్చారు. కౌన్సిలర్లను కలసిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు మహేష్, సీటీయూ సహాయ కార్యదర్శి సత్తయ్య, కార్మికులు యాదయ్య, విద్యాసాగర్, విజయ్ కుమార్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్‌నకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త సురేందర్‌గౌడ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా.. బాధిత కుటుంబాన్ని సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. ఆర్థికసాయం అందజేసి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, విజయమోహన్‌రెడ్డి, జగదీశ్వర్, నాగిరెడ్డి, లక్ష్మీనారాయణ, శరత్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, రఘు తదితరులు ఉన్నారు.

శ్రీకృష్ణుడి బోధనలు ఆచరణీయం



సందేశం ఇస్తున్న అచల గురువులు

హన్వాడ: జగద్గురువు శ్రీకృష్ణుడి బోధనలు ఆచరణీయమని ఆచలగురు గుర్రాల మోహన్‌రావు అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సోమవారం మండలకేంద్రంలోని కృష్ణసాందీపని ఆవాసం, ఆచలగురు పీఠంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కార్యక్రమానుద్దేశించి మాట్లాడారు. అచలగురు పీఠం సర్వమానవాళికి మార్గదర్శనం అని అన్నారు. జగద్గురు శ్రీకృష్ణ భగవానుడు బోధించిన విషయాలను ప్రజలకు వివరించి వారిని సన్మార్గంలో నడిపేందుకు ఆచలపీఠంలోని గురువుల కృషి ఎనలేనిదని వివరించారు. అంతకుముందు మండలకేంద్రంలో శోభాయాత్ర నిర్వహించారు. గురుభక్తులందరూ భజనలు చేస్తూ ముందుకు కదిలారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గురుపీఠాధిపతులకు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. అచల గురువులు అనంతరెడ్డి, భీమయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదవులంతా సంపూర్ణ అక్షరాస్యత సాధించాలి



ధ్వజావిష్కరణ చేస్తున్న నాయకులు

నవాబుపేట: యాదవులంతా సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని.. సంఘం మండల అధ్యక్షుడు యాదయ్య, ప్రధానకార్యదర్శి మల్లేష్‌యాదవ్ సూచించారు. సోమవారం మండలకేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవాన్ ధ్వజావిష్కరణ చేశారు. యాదవుల్లో అక్షరాస్యత చాలా తక్కువగా ఉందన్నారు. దీంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పాడుతోందని వివరించారు. అక్షరాస్యత సాధిస్తే రాజకీయంగానూ ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. నాయకులు మెండే అంజయ్య, మాధవులు, మల్లేష్, శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, వెంకటయ్య, కేశవులు, జైపాల్, నర్సింహులు, యాదయ్య, నరేష్, రఘు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



పారిశుద్ధ్య చర్యలు చేపట్టరా?

మండలంలోని నెల్లికొండిలో పారిశుద్ధ్య చర్యలు సరిగా చేపట్టడం లేదు. దీంతో గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా 6వ వార్డులో డ్రెయినేజీలు మురుగుతో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. చుట్టూ కంప చెట్లు, పిచ్చిమొక్కలు సైతం పెరిగిపోయాయి. దీంతో స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా పారిశుద్ధ్య చర్యలు చేపటాల్సిన అవసరముందని చెబుతున్నారు.

– చిన్నచింతకుంట

సంప్రదించవలసిన అధికారి సుష్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, నెల్లికొండి. | ఫోన్ నంబరు- 81257 04417



అడ్డాకుల పెద్ద చెరువుకు వస్తున్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కృష్ణా జలాలు

జలకళ



గౌరిదేవిపల్లి వద్ద నిండిన చెక్‌డ్యాం

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని పెద్దవాగులో నిర్మించిన చెక్‌డ్యాంలు జలకళను సంతరించుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి భూత్పూర్ మండలం మీదుగా పెద్దవాగుకు వరద వస్తోంది. మూసాపేట మండలంలోని నిజాలాపూర్, సంకలమద్ది, అడ్డాకుల మండలంలోని గౌరిదేవిపల్లి, కందూర్ చెక్‌డ్యాంలు నిండి నీళ్లు దిగువకు ప్రవహిస్తున్నాయి. పెద్దవాగుకు కందూర్ వైపు నుంచి కూడా వరద వస్తోంది. ఇదిలా ఉండగా సంకలమద్ది శివారు నుంచి కొమిరెడ్డిపల్లి మీదుగా పొన్నకల్, కందూర్ స్టేజీ వద్ద చెక్‌డ్యాం నుంచి ప్రత్యేక కాలువల ద్వారా గుడిబండ చెరువులకు నీళ్లు వెళ్తున్నాయి. కాగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నుంచి ఖిల్లాఘనపురం పెద్ద చెరువు నుంచి కాలువ ద్వారా ఉప్పరపల్లి మీదుగా కృష్ణా జలాలు అడ్డాకుల పెద్ద చెరువుకు చేరుతున్నాయి. ఆలస్యంగానైనా మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని చెరువులకు వరద నీళ్లు చేరుతుండటం, పెద్దవాగుకు వరద రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.